సాక్షి
భద్రాద్రి కొత్తగూడెం

గురువారం । 16 । మే । 2024



ప్రభుత్వాస్పత్రిలో ఇంటిదొంగలు !
మణుగూరు ప్రభుత్వ ఆస్పత్రికి దాతలు అందించిన సామగ్రిని సిబ్బందే పక్కదారి పట్టిస్తున్నారనే ఆరోపణలు వస్తున్నాయి. 8లో



ఎక్స్‌టర్నల్ పోస్టులకు దరఖాస్తులు
సింగరేణి సంస్థలో ఎక్స్‌టర్నరల్ ఉద్యోగాల భర్తీకి దరఖాస్తు చేసుకునేందుకు ఆన్‌లైన్ పోర్టల్ అందుబాలోకి వచ్చింది. 8లో

గరిష్ఠం / కనిష్ఠం
34° / 26°

వాతావరణం
జిల్లాలో గురువారం సాధారణ ఉష్ణోగ్రతలు నమోదవుతాయి. కొన్ని చోట్ల వర్షం కురిసే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

నేత్రపర్వంగా రామయ్య నిత్యకల్యాణం



నిత్యకల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు

భద్రాచలం: భద్రాచలం శ్రీ సీతారామచంద్ర స్వామి వారి నిత్యకల్యాణ వేడుక బుధవారం నేత్రపర్వంగా సాగింది. తెల్లవారుజామున గర్భగుడిలో స్వామివారికి సుప్రభాత సేవ, సేవాకాలం, ఆరాధన తదితర పూజలు చేశారు. అనంతరం బేడా మండపంలో కొలువుదీర్చి విశ్వక్సేన పూజ, పుణ్యావాచనం చేశారు. స్వామివారికి కంకణధారణ, యజ్ఞోపవీత ధారణ, అమ్మవారికి కంకణధారణ, యోక్త్రధారణ గావించి నిత్యకల్యాణ ఘట్టాన్ని అర్చకులు శాస్త్రోక్తంగా నిర్వహించారు.

గ్రూప్‌-1, సివిల్స్ గ్రాండ్ టెస్ట్‌లు

ఖమ్మంమయూరిసెంటర్: ఉమ్మడి జిల్లాలో టీఎస్‌పీఎస్సీ గ్రూప్‌-1(ప్రిలిమ్స్), సివిల్స్‌కు సిద్ధమవుతున్న అభ్యర్థులకు పరీక్షలపై అవగాహన పెంపొందించేలా ఆన్‌లైన్ గ్రాండ్ టెస్ట్‌లు నిర్వహించనున్నట్లు బీసీ స్టడీ సర్కిల్ డైరెక్టర్ జి.శ్రీలత తెలిపారు. గ్రూప్‌-1 నమూనా పరీక్షలు ఈనెల 18, 20, 22, 24, 25, 27, 29, 31, జూన్ 1, 3వ తేదీల్లో జరుగుతాయని వెల్లడించారు. ఇక సివిల్స్ నమూనా పరీక్షలను ఈనెల 23, 24, 25, 27, 29, 31, జూన్ 1, 3వ తేదీల్లో నిర్వహించనున్నట్లు తెలిపారు. అర్హులైన అభ్యర్థులు https// tsbcstudycircle. cgg. in/ firstpage. do వెబ్‌సైట్‌లో రిజిస్ట్రేషన్ చేసుకోవాలని, పూర్తి సమాచారం కోసం 96664 36042, 96521 61850 నంబర్లలో సంప్రదించాలని డైరెక్టర్ సూచించారు.

నేటి నుంచి వేసవి శిక్షణ శిబిరం

పాల్వంచ : మండలంలోని కిన్నెరసాని గిరిజన ఆశ్రమ మోడల్ క్రీడా పాఠశాలలో గురువారం నుంచి ఈనెల 30వ తేదీ వరకు వివిధ క్రీడాంశాల్లో వేసవి శిక్షణ శిబిరం నిర్వహిస్తున్నట్లు ఐటీడీఏ క్రీడల అధికారి బొల్లి గోపాలరావు, క్యాంప్ ఇన్‌చార్జ్ కొమరం వెంకట నారాయణ తెలిపారు. ఈ మేరకు బుధవారం వారొక ప్రకటన విడుదల చేశారు. 60 మంది బాలురు, 60 బాలికలకు ఆర్చరీ, అథ్లెటిక్స్, చెస్, కబడ్డీ, ఖోఖో, వాలీబాల్ వంటి క్రీడాంశాల్లో శిక్షణ ఇస్తామని వివరించారు.

మారిన ‘దోస్త్’ షెడ్యూల్

ఖమ్మం సహకారనగర్: డిగ్రీ కళాశాలల్లో ప్రవేశానికి ఏర్పాటుచేసిన డిగ్రీ ఆన్‌లైన్ సర్వీసెస్ తెలంగాణ(దోస్త్) షెడ్యూల్‌ను మారుస్తూ రాష్ట్ర ఉన్నత విద్యాశాఖ ఉత్తర్వులు జారీ చేసింది. మూడు విడతల్లో ప్రవేశాలు కల్పిస్తామని ప్రకటించగా, ఈనెల 15నుంచి 27వ తేదీ వరకు తొలిదశ వెబ్ ఆప్షన్లు ఇచ్చుకోవాలని మొదటగా సూచించారు. అయితే, డిగ్రీ కళాశాలల్లో పలు కొత్త కోర్సులు ప్రవేశపెట్టనున్న నేపథ్యాన షెడ్యూల్‌లో మార్పులు చేశారు. తాజా షెడ్యూల్ ప్రకారం ఈ నెల 29వ తేదీ వరకు రిజిస్ట్రేషన్‌కు అవకాశం కల్పించారు. ఈనెల 20 నుంచి 30వ తేదీ వరకు వెబ్ ఆప్షన్లు ఇస్తే జూన్ 6వ తేదీన మొదటి విడత సీట్లు కేటాయించనున్నారు. ఇక ఇక రెండో విడత ప్రక్రియ జూన్ 6నుంచి ప్రారంభమై 18వ తేదీతో సీట్ల కేటాయింపుతో ముగుస్తుంది. మూడో దశలో జూన్ 19నుంచి వెబ్‌ఆప్షన్లకు అవకాశముండగా, 29న సీట్లు కేటాయిస్తారు. మూడు విడతల్లో సీట్లు దక్కిన వారు నిర్ణీత తేదీల్లో సెల్ఫ్ రిపోర్టింగ్ చేస్తే జూలై 1నుంచి 6వ తేదీ వరకు ఓరియెంటేషన్ కార్యక్రమాలు నిర్వహించి 8వ తేదీన తరగతులు ప్రారంభిస్తారు.

ప్రచారం ఫలించేనా?

కాంగ్రెస్‌కు కీలకంగా మారిన కొత్తగూడెం

- కేసీఆర్ రోడ్‌షోపై బీఆర్ఎస్ ఆశలు
- ఖమ్మంలో సత్తా చాటుతామంటున్న కమలం నేతలు

సాక్షి ప్రతినిధి, భద్రాద్రి కొత్తగూడెం: పార్లమెంట్ ఎన్నికల పోలింగ్ ముగిసింది. తమ పార్టీ గుర్తుపై పోటీ చేసిన అభ్యర్థి గెలుపు కోసం అన్ని పార్టీల నేతలు గత రెండు నెలలుగా శ్రమించారు. తమ కష్టానికి తగిన ఫలితం ఎలా ఉండబోతుందనే అంచనాల్లో మునిగి తేలుతున్నారు.

కొత్తగూడెంలో ఊపు..

ఖమ్మం పార్లమెంట్ స్థానం పరిధిలో కొత్తగూడెం, అశ్వారావుపేట నియోజకవర్గాలు ఉన్నాయి. ఇందులో అశ్వారావుపేటలో కాంగ్రెస్‌కు సిట్టింగ్ ఎమ్మెల్యేగా జారే ఆదినారాయణ ఉండటంతో ప్రచార బాధ్యతల్లో ఎలాంటి ఇబ్బందులూ రాలేదు. కానీ కొత్తగూడెం విషయంలో కొంత సందిగ్ధత నెలకొంది. గత అసెంబ్లీ ఎన్నికల్లో కొత్తగూడెం స్థానాన్ని పొత్తులో భాగంగా సీపీఐకి కాంగ్రెస్ కేటాయించింది. దీంతో అసెంబ్లీ ఎన్నికలకు ముందే చాలా మంది నేతలు కాంగ్రెస్‌ను వీడి కారు పార్టీలో చేరిపోయారు. ఇక మార్చిలో పార్లమెంట్ ఎన్నికల షెడ్యూల్ వచ్చినప్పటికీ కాంగ్రెస్ తరఫున కొత్తగూడెంలో ఎన్నికల బాధ్యతలు తీసుకునేవారు కరువయ్యారు. మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి అనుచర వర్గం, నాగ సీతారాములు వంటి వారే ప్రధానంగా కాంగ్రెస్ పక్షాన ప్రచారం నిర్వహించారు. అభ్యర్థిగా రామసహాయం రఘురాంరెడ్డి ఖరారైన తర్వాత ఒక్కసారిగా ఆ పార్టీలో ఊపు వచ్చింది. గతంలో కాంగ్రెస్‌ను వీడిన నేతలు, బీఆర్ఎస్‌లో చేరిన వారు తిరిగి సొంతగూటికి చేరుకున్నారు. పోలింగ్ తేదీకి వారం రోజుల ముందు నుంచి సీపీఐ కేడర్ సైతం కాంగ్రెస్ అభ్యర్థి తరఫున ప్రచారాన్ని ముమ్మరం చేసింది. దీంతో ఖమ్మం పార్లమెంట్ స్థానంలో కాంగ్రెస్ అభ్యర్థి గెలుపు ఖాయమనే ధీమా ఆ పార్టీ నేతల్లో నెలకొంది. ఇక ఇల్లెందు, భద్రాచలం, పినపాకలో కాంగ్రెస్ సిట్టింగ్ ఎమ్మెల్యేలు ఉండటం, మార్చి మొదటి వారంలోనే అభ్యర్థిగా బలరాంనాయక్ పేరు ఖరారు కావడంతో అక్కడ ప్రచారంలో కాంగ్రెస్ ఆది నుంచీ ముందు వరుసలోనే ఉంది. తద్వారా మానుకోటలో కాంగ్రెస్‌దే విజయమనే నమ్మకం హస్తం పార్టీ నేతల్లో నెలకొంది.



కొత్తగూడెంలో ప్రచారం చేస్తున్న కాంగ్రెస్ అభ్యర్థి రఘురాంరెడ్డి(ఫైల్)



బీజేపీ అభ్యర్థి తాండ్ర వినోద్‌రావు ప్రచారం(ఫైల్)

కేసీఆర్‌పైనే భారం..

అసెంబ్లీ ఎన్నికల్లో వచ్చిన చేదు ఫలితాలు బీఆర్ఎస్ పార్టీకి ఇప్పటికీ మింగుడు పడడం లేదు. పైగా భద్రాచలం నుంచి కారు గుర్తుపై గెలుపొందిన తెల్లం వెంకట్రావు పార్టీని వీడటం మరింత చిక్కుల్లోకి నెట్టింది. ఖమ్మం, మహబూబాబాద్ స్థానాల అభ్యర్థులుగా నామా నాగేశ్వరరావు, మాలోతు కవిత పేర్లను మార్చి మొదటి వారంలోనే ప్రకటించినా ఆశించిన స్థాయిలో ప్రచారం జరగలేదు. స్తబ్దుగా ఉన్న బీఆర్ఎస్ కేడర్‌లో కేసీఆర్ నిర్వహించిన ఉమ్మడి జిల్లా పర్యటన జోష్ నింపింది. ఖమ్మం, కొత్తగూడెంలో నిర్వహించిన రోడ్‌షోలు ఆ పార్టీకి ఊపు తెచ్చి పెట్టాయి. కేసీఆర్ పర్యటన తర్వాత జిల్లా అధ్యక్షుడు రేగా కాంతారావు సైతం శక్తి వంచన లేకుండా ప్రచార బాధ్యతలు భుజాన వేసుకుని మోశారు. బీఆర్ఎస్ అభ్యర్థులు విజయం సాధిస్తే.. ఆ క్రెడిట్‌లో సింహభాగం కేసీఆర్ రోడ్ షోలకే వెళ్తుందనే అభిప్రాయం సర్వత్రా వ్యక్తమవుతోంది.

వన్ మేన్ షో..

బీజేపీ తరఫున ఖమ్మం నుంచి తాండ్ర వినోద్‌రావు, మహబూబాబాద్ నుంచి ఆజ్మీర సీతారాంనాయక్ పోటీ చేశారు. అభ్యర్థిగా ప్రకటించిన తర్వాత భద్రాచలంలో సీతారాంనాయక్ చేసిన తొలి పర్యటన వివాదాస్పదమైంది. ఆ తర్వాత కూడా ఆయన ఆశించిన స్థాయిలో ఇల్లెందు, పినపాక, భద్రాచలంలో ప్రచారం నిర్వహించలేకపోయారు. జిల్లా అధ్యక్షుడు కే.వీ.రంగాకిరణ్ ఒక్కరే సాధ్యమైనంత మేరకు పార్టీ కేడర్‌ను ఎన్నికలకు సన్నద్ధం చేయగలిగారు. ఇక ఖమ్మం స్థానం నుంచి పోటీ చేసిన తాండ్ర వినోద్‌రావు తన గెలుపు కోసం తీవ్రంగానే శ్రమించారు. ఫిబ్రవరిలో అయోధ్య రామమందిరం ప్రారంభోత్సవం నుంచి మొదలైన ఆయన ప్రచారం రోజురోజుకూ పెరుగుతూ వచ్చింది. ఆ పార్టీ జాతీయ అధ్యక్షుడు జేపీ నడ్డాతో కొత్తగూడెంలో భారీ బహిరంగసభ నిర్వహించారు. బస్తర్‌లో ఉన్న కాకతీయ వంశ వారసుడు కమల్‌చంద్ర భంజ్‌దేవ్‌ను ప్రచారానికి రప్పించారు. తాను ములకలపల్లి మండలంలో పుట్టానని, పాల్వంచలో చదువుకున్నానని, తానే స్థానికుడిని అంటూ విస్తృత ప్రచారం చేశారు. ఈ ఎన్నికల్లో ఖమ్మం స్థానం నుంచి బీజేపీ గణనీయంగా ఓట్లు సాధించేలా ఆయన సర్వశక్తులు ఒడ్డారు.



‘పట్టు’ ఎవరిదో..

- పట్టభద్రుల ఎమ్మెల్సీ ఉప ఎన్నికపై పార్టీల నజర్
- ఉమ్మడి జిల్లాలో 1,23,706 మంది గ్రాడ్యుయేట్ ఓటర్లు
- ఇప్పటికే అభ్యర్థులను ప్రకటించిన పార్టీలు
- సన్నాహక సమావేశాల్లో నిమగ్నమైన నాయకులు
- వరంగల్, నల్లగొండ, ఖమ్మం జిల్లాల నేతలతో కేటీఆర్ భేటీ



ఉమ్మడి జిల్లాలో ఓటర్లు..	
పురుషులు	73,103
మహిళలు	50,599
ఇతరులు	04
మొత్తం	1,23,706
పోలింగ్ కేంద్రాలు	170

సాక్షిప్రతినిధి, ఖమ్మం: లోక్‌సభ ఎన్నికలు ముగియగానే ఆయా పార్టీలు ఎమ్మెల్సీ ఎన్నికపై దృష్టి సారించాయి. వరంగల్ – నల్లగొండ – ఖమ్మం పట్టభద్రుల నియోజకవర్గానికి జరగనున్న ఉప ఎన్నికలో 52 మంది అభ్యర్థులు బరిలో నిలవగా, ప్రధాన పోటీ మాత్రం కాంగ్రెస్, బీఆర్ఎస్, బీజేపీ మధ్యే ఉండనుంది. ఈనెల 27న ఉదయం 8 నుంచి సాయంత్రం 4 గంటల వరకు ఓటింగ్ నిర్వహించి, జూన్ 5న ఓట్లు లెక్కిస్తారు. గ్రాడ్యుయేట్ నియోజకవర్గంలోని ఉమ్మడి ఖమ్మం జిల్లాలో 1,23,706 మంది ఓటర్లు ఉండగా.. వీరి ఓట్ల సాధనకు అభ్యర్థులు జిల్లాలో పర్యటనకు సిద్ధమవుతున్నారు. మరోవైపు బుధవారం మూడు ఉమ్మడి జిల్లాల బీఆర్ఎస్ నేతలతో మాజీ మంత్రి, బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ హైదరాబాద్‌లో భేటీ అయ్యారు.

పల్లా రాజీనామాతో..

వరంగల్ – నల్లగొండ – ఖమ్మం పట్టభద్రుల నియోజకవర్గానికి 2021లో ఎన్నిక జరగగా బీఆర్ఎస్ అభ్యర్థి పల్లా రాజేశ్వర్‌రెడ్డి విజయం సాధించారు. గతేడాది డిసెంబర్‌లో ఆయన జనగామ ఎమ్మెల్యేగా గెలవడంతో ఎమ్మెల్సీ పదవికి రాజీనామా చేశారు. దీంతో ఉప ఎన్నిక అనివార్యమైంది. ఈ ఎన్నికల్లో కాంగ్రెస్ నుంచి తీన్మార్ మల్లన్న అలియాస్ చింతపండు నవీన్, బీఆర్ఎస్ నుంచి ఏనుగుల రాకేష్‌రెడ్డి, బీజేపీ నుంచి ప్రేమేందర్‌రెడ్డి, ఓయూ నిరుద్యోగ జేఏసీ నేత, స్వతంత్ర అభ్యర్థి పాలకూరి అశోక్‌కుమార్ తదితర 52 మంది పోటీ చేస్తున్నారు. అభ్యర్థులతోపాటు పార్టీ ముఖ్యనేతలు ప్రచారంపై దృష్టి సారించగా.. త్వరలోనే ఉమ్మడి ఖమ్మం జిల్లాలో ప్రచారానికి సమాయత్తమవుతున్నారు.

కాంగ్రెస్‌లో ధీమా..

అసెంబ్లీ ఎన్నికల్లో ఉమ్మడి ఖమ్మం జిల్లాలోని మెజార్టీ స్థానాలను గెలిచిన కాంగ్రెస్ పట్టు నిరూపించుకుంది. పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లోనూ గెలుపు ఖాయమని ధీమా వ్యక్తం చేస్తూ.. ఇక్కడి నుంచి కాంగ్రెస్ అభ్యర్థి మల్లన్నకు ఎక్కువ ఓట్లు పోలయ్యేలా చూసేందుకు మంత్రులు, పార్టీ నాయకులు సిద్ధమవుతున్నారు. కాంగ్రెస్ అభ్యర్థిగా బరిలో నిలిచిన మల్లన్న గత ఎమ్మెల్సీ ఎన్నికల్లోనూ స్వతంత్ర అభ్యర్థిగా పోటీ చేసి రెండో స్థానంలో నిలిచారు. ప్రస్తుతం పార్టీ టికెట్ దక్కడంతో గెలుపుపై ధీమాగా ఉండగా.. అసెంబ్లీ ఎన్నికల్లో ఉమ్మడి ఖమ్మం, నల్లగొండ, వరంగల్ జిల్లాల్లో కాంగ్రెస్ అభ్యర్థులు ఘన విజయం సాధించిన నేపథ్యాన ఈ ఎన్నికల్లోనూ సత్తా చాటుతామనే నమ్మకంతో పార్టీ ఉంది.

బీఆర్ఎస్ మరోసారి..

పట్టభద్రుల ఎమ్మెల్సీ సిట్టింగ్ స్థానాన్ని గెలిచి పట్టు నిరూపించుకోవాలనే పట్టుదలతో బీఆర్ఎస్ ఉంది. ఈసారి కూడా గెలుస్తామనే నమ్మకం నేతల్లో వ్యక్తమవుతోంది. సిట్టింగ్ స్థానం కావడం, కేసీఆర్ చరిష్మా బీఆర్ఎస్ అభ్యర్థి గెలుపునకు దోహదపడుతుందనే భావనతో తమ అభ్యర్థిగా ఏనుగుల రాకేష్‌రెడ్డిని బరిలోకి దింపింది. ఆయన గ్రాడ్యుయేట్లను కలుస్తూ ఓట్లు అభ్యర్థిస్తున్నారు. ఎమ్మెల్సీ ఎన్నికల్లో గెలుపును బీఆర్ఎస్ ప్రతిష్ఠాత్మకంగా తీసుకోగా, పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ మూడు జిల్లాల నేతలతో హైదరాబాద్‌లో భేటీ అయ్యారు. ఈ సమావేశానికి ఎంపీ వద్దిరాజు రవిచంద్ర, మాజీ మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్, ఎమ్మెల్సీ తాతా మధు, ఎంపీ అభ్యర్థి నామా నాగేశ్వరరావుతో పాటు మాజీ ఎమ్మెల్యేలు, నేతలు హాజరయ్యారు. ఈ మేరకు ఎన్నికల్లో అనుసరించాల్సిన వ్యూహాలపై చర్చించిన కేటీఆర్ దిశానిర్దేశం చేశారు.

సత్తా చాటాలని బీజేపీ..

ఈ ఎన్నికల్లో సత్తా చాటాలనే ఉత్సాహంతో బీజేపీ ఉంది. పార్టీ తరఫున రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గుజ్జుల ప్రేమేందర్‌రెడ్డి బరిలో ఉన్నారు. విద్యావంతులైన ఓటర్లు తమకు ఓటు వేస్తారని ఆ పార్టీ భావిస్తోంది. ఈ ఎన్నికల్లోనూ మోదీ చరిష్మాను ఉపయోగించుకుని గట్టెక్కాలనే ప్రయత్నాల్లో ఉంది. శాసన మండలిలో బీజేపీ బలం పెరిగితే సమస్యలపై ప్రశ్నించే వారి సంఖ్య ఎక్కువ అవుతుందని ఆ పార్టీ నేతలు అంటున్నారు. త్వరలోనే ఉమ్మడి ఖమ్మం జిల్లాలో బీజేపీ ఎమ్మెల్సీ అభ్యర్థితో ప్రచా రం చేయించేందుకు పార్టీ ఏర్పాట్లు చేస్తోంది.

మొత్తం ఓట్లలో 26.78 శాతం

వరంగల్ – నల్లగొండ – ఖమ్మం పట్టభద్రుల ఎమ్మెల్సీ నియోజకవర్గంలో 4,61,806 మంది ఓటర్లు ఉండగా వీరిలో ఉమ్మడి ఖమ్మం జిల్లాలో 1,23,706 మంది ఉన్నారు. ఇది మొత్తం ఓటర్లలో 26.78 శాతం ఉన్న నేపథ్యాన వారిని ఆకట్టుకునేందుకు అన్ని పార్టీలూ వ్యూహాలు రచిస్తున్నాయి.

రాష్ట్రీయ బాల పురస్కార్ అవార్డులకు దరఖాస్తుల ఆహ్వానం

ఖమ్మంవన్‌టౌన్: ఆపదలో ఉన్న బాలబాలికలను రక్షించిన బాలలు, స్వచ్ఛంద సంస్థల బాధ్యుల నుంచి ప్రధానమంత్రి రాష్ట్రీయ బాల పురస్కార్ అవార్డుల కోసం దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ఖమ్మం జిల్లా సంక్షేమాధికారి రాంగోపాల్‌రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. నూతన ఆవిష్కరణలు, అసాధారణ ప్రతిభా పాటవాలు, ఆటలు, కళలు, సాహిత్యం, సామాజిక సేవ, ధైర్యసాహసాలు తదితర అంశాల్లో అవార్డులు అందజేయనున్నట్లు పేర్కొన్నారు. ఈ అవార్డుల కోసం 5 నుంచి 18 ఏళ్లలోపు బాలబాలికలు దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపారు. ఇక స్వచ్ఛంద సంస్థలైతే ఏడేళ్ల ఆపైన బాలబాలికల తరఫున పనిచేస్తూ వారి జీవితాల్లో మార్పు తీసుకొచ్చిన వారై ఉండాలన్నారు. అర్హులైన వారు https:// awards, gov. in వెబ్‌సైట్‌లో జూలై 31 లోగా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

ఆరోగ్యంపై శ్రద్ధ వహించాలి

ఐటీడీఏ పీఓ ప్రతీక్ జైన్

భద్రాచలంటౌన్: భద్రాచలం ఏజెన్సీలో మారుమూల గ్రామాల ప్రజలు ఆరోగ్యంపై శ్రద్ధ వహించాలని ఐటీడీఏ పీఓ ప్రతీక్‌జైన్ అన్నారు. వర్షకాలం వస్తున్న నేపథ్యంలో సీజనల్ వ్యాధులు ప్రబలే ప్రమాదం ఉందని, అస్వస్థతకు గురైన వారు వెంటనే సమీపంలోని ప్రభుత్వ ఆస్పత్రుల్లో చికిత్స చేయించుకోవాలని సూచించారు. జాతీయ డెంగీ డే సందర్భంగా పరిసరాల పరిశుభ్రత, ఆరోగ్యంపై ఆదివాసీ గిరిజనులకు పలు సూచనలు చేశారు. ప్రతి ఒక్కరూ ఇంటి పరిసరాల్లోని గుంతలు, కొబ్బరి బోండాలు, పాత టైర్లు, నీటి తొట్లలో నీరు నిల్వ ఉండకుండా చూడాలని సూచించారు.

‘పినపాక’ ప్రజల సహకారం మరువలేనిది

మణుగూరురూరల్: పార్లమెంట్ ఎన్నికల షెడ్యూల్ విడుదలైన నాటి నుంచి పోలింగ్ ప్రక్రియ ముగిసే వరకు పినపాక నియోజకవర్గ ప్రజలు అందించిన సహకారం మరువలేనిదని, ఇందుకు వారికి ప్రత్యేక ధన్యవాదాలు తెలుపుతున్నానని నియోజకవర్గ అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారి, భద్రాచలం ఐటీడీఏ పీఓ ప్రతీక్ జైన్ తెలిపారు. బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. మహబూబాబాద్ పార్లమెంట్ ఎన్నికల పోలింగ్ ప్రక్రియ ఎలాంటి అవాంఛనీయ ఘటనలు లేకుండా సజావుగా సాగడం పట్ల హర్షం వ్యక్తం చేశారు. అందరి సహకారంతోనే ఇది సాధ్యమైందని తెలిపారు. మావోయిస్టు ప్రభావిత మండలాలైన గుండాల, ఆళ్లపల్లి, కరకగూడెం తదితర మండలాల్లో కూడా ఎలాంటి విఘ్నాలకు తావు లేకుండా ప్రశాంత వాతావరణంలో ఎన్నికల ప్రక్రియ ముగియడం ప్రశంసనీయమని అన్నారు. ఎన్నికలు సజావుగా నిర్వహించేందుకు ప్రత్యేక బాధ్యత వహించిన మణుగూరు తహసీల్దార్ వి. రాఘవరెడ్డికి, నాయబ్ తహసీల్దార్, ఎన్నికల డీటీ నాగరాజుతో పాటు రెవెన్యూ సిబ్బందికి అభినందనలు తెలిపారు.



మాట్లాడుతున్న ఏఆర్‌ఓ ప్రతీక్ జైన్

ఎన్నికల వేళ.. | కాసుల గలగల

- ఆర్టీసీకి కలిసొచ్చిన లోక్‌సభ ఎన్నికలు
- ఆరు రోజుల్లో రీజియన్‌కు రూ.7.64 కోట్ల ఆదాయం
- రద్దీకి అనుగుణంగా బస్సులు తిప్పడంతో ఫలితం

ఖమ్మంమయూరిసెంటర్: ఆర్టీసీకి ఎన్నికల పండుగ కలిసొచ్చింది. ఉమ్మడి ఖమ్మం జిల్లా ఏపీకి సరిహద్దుగా ఉండడంతో ఇక్కడ లోక్‌సభ ఎన్నికలు, ఏపీలో సాధారణ ఎన్నికల్లో ఓటు వేసేందుకు ఇతర ప్రాంతాల్లో ఉన్న వారు స్వస్థలాలకు చేరుకున్నారు. వీరిలో ఎక్కువ మంది ఆర్టీసీ బస్సులను ఆశ్రయించడంతో సంస్థకు భారీగా ఆదాయం సమకూరింది. ఉమ్మడి ఖమ్మం జిల్లా ఓటర్లతో పాటు ఏపీలోని సరిహద్దు ప్రాంతాల ఓటర్లు ఖమ్మం రీజియన్ మీదుగా ఆర్టీసీ బస్సుల్లో గమ్యస్థానాలకు చేరుకున్నారు.

కొత్తగూడెంలో 106 శాతం ఓఆర్..

ఒకవైపున విద్యాసంస్థలకు వేసవి సెలవులు కొనసాగుతుండగా.. ఎన్నికలు సైతం రావడంతో ఈనెల 9వ తేదీ నుంచే ప్రజలు ఓటు వేసేందుకు తమ సొంత గ్రామాలకు ప్రయాణం ఆరంభించారు. ఫలితంగా ఈనెల 9 నుంచి 14వ తేదీ వరకు ఆరు రోజుల్లో ఖమ్మం రీజియన్‌కు రూ.7.64 కోట్ల ఆదాయం సమకూరింది. ఈ ఆరు రోజుల్లో రీజియన్‌లోని ఖమ్మం, సత్తుపల్లి, మధిర, కొత్తగూడెం, భద్రాచలం, మణుగూరు, ఇల్లెందు డిపోల నుంచి 519 బస్సులు 12.34 లక్షల కిలోమీటర్ల మేర ప్రయాణం సాగించాయి. కొత్తగూడెం డిపో అత్యధికంగా 106 శాతం ఓఆర్ (ఆక్యుపెన్సీ రేషియో) సాధించగా, ఖమ్మం డిపోలో 99 శాతం ఓఆర్ నమోదైందని అధికారులు తెలిపారు.

సురక్షితం అని..

ఎన్నికల వేళ ప్రయాణాలు సాగించిన ఎక్కువ మంది ఆర్టీసీ బస్సులనే ఎంచుకున్నారు. సురక్షిత ప్రయాణం కావడంతో పాటు తెలంగాణలో మహాలక్ష్మి పథకం ద్వారా మహిళలకు ఉచిత ప్రయాణం అందుబాటులో ఉండడంతో ఆర్టీసీ వైపే మొగ్గుచూపారు. ఇక ఆర్టీసీ ఖమ్మం రీజియన్ అధికారులు ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని విజయవాడకు ఖమ్మం నుంచి మధిర మీదుగా ప్రత్యేక బస్సులు నడిపారు. రద్దీకి అనుగుణంగా ఎప్పటికప్పుడు అదనపు సర్వీసులు సైతం ఏర్పాటు చేయడంతో ప్రయాణికులు ప్రైవేట్ వాహనాలకు బదులు ఆర్టీసీ బస్సుల్లోనే వెళ్లేందుకు ఆసక్తి చూపారు.



సత్తుపల్లి బస్టాండ్‌లో ప్రయాణికుల రద్దీ

కొనసాగుతున్న రద్దీ

ఎన్నికలు ముగిసి రెండు రోజులు గడిచినా ఇంకా బస్సుల్లో రద్దీ తగ్గలేదు. ఎన్నికల్లో ఓటు వేసేందుకు హైదరాబాద్, బెంగళూరుతో పాటు ఇతర ప్రాంతాల నుంచి ప్రజలు జిల్లాకు చేరుకున్నారు. ఇక ఆయా ప్రాంతాల నుంచి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని జిల్లా సరిహద్దు ప్రాంతానికి చేరుకున్న వారు కూడా తిరిగి వెళ్తున్నారు. ఖమ్మం మీదుగా తిరుగు ప్రయాణం కావడంతో ఆర్టీసీ బస్టాండ్లు కిటకిటలాడుతున్నాయి. బుధవారం కొత్తగూడెం, సత్తుపల్లి, భద్రాచలం, మధిర, ఖమ్మం నుంచి హైదరాబాద్‌కు వెళ్లే ప్రయాణికుల సంఖ్య భారీగా నమోదైంది. మరో రెండు రోజుల పాటు రద్దీ ఇలాగే ఉంటుందని అంచనా వేస్తున్న అధికారులు అందుకు అనుగుణంగా సర్వీసులు నడిపిస్తున్నారు.



హైదరాబాద్ ఎల్‌బీ నగర్ వద్ద పర్యవేక్షిస్తున్న ఖమ్మం ఆర్‌ఎం వెంకన్న, అధికారులు (ఫైల్)

పర్యవేక్షిస్తున్న అధికారులు..

ఆర్టీసీలో ప్రయాణించే వారి సంఖ్య భారీగా పెరగడంతో ఖమ్మం రీజియన్ అధికారులు నిరంతరం పర్యవేక్షిస్తున్నారు. జిల్లా వ్యాప్తంగా రెగ్యులర్ సర్వీసులే కాక రద్దీకి అనుగుణంగా ప్రత్యేక బస్సులనూ నడిపించారు. హైదరాబాద్ సిటీలోని బస్సులను సైతం జిల్లాలో స్పెషల్ సర్వీసులుగా తిప్పారు. ఖమ్మం ఆర్‌ఎం చెరుకుపల్లి వెంకన్న హైదరాబాద్ ఎల్‌బీ నగర్ పాయింట్‌లో ఉండి ప్రయాణికుల రద్దీని గమనిస్తూ బస్సులను ఏర్పాటు చేయించారు. జిల్లాలోని డిపో మేనేజర్లతో నిరంతరం మాట్లాడుతూ సూచనలు చేశారు. మొత్తంగా ఆరు రోజుల్లో రీజియన్‌కు రూ.7.64 కోట్లు ఆదాయం నమోదు కావడంపై ఆర్టీసీ అధికారులు, సిబ్బందిని ఆర్‌ఎం అభినందించారు.

ఈనెల 9నుండి 14 వరకు డిపోల వారీగా నడిపిన బస్సులు, ఆదాయం

డిపో	బస్సుల సంఖ్య	కిలోమీటర్లు (లక్షల్లో)	ఆదాయం (రూ.కోట్లలో)
ఖమ్మం	133	3.12	2.00
సత్తుపల్లి	97	2.20	1.36
భద్రాచలం	87	2.27	1.37
కొత్తగూడెం	60	1.31	0.88
మధిర	60	1.40	0.81
మణుగూరు	64	1.61	0.96
ఇల్లెందు	18	0.42	0.22

ప్లాంటేషన్లపై ప్రత్యేక శ్రద్ధ పెట్టాలి

- నాలుగు లక్షల వెదురు మొక్కలు నాటడమే లక్ష్యం
- సీసీఎఫ్ భీమానాయక్ వెల్లడి

అశ్వారావుపేటరూరల్ : అటవీ శాఖ సిబ్బంది విధుల పట్ల అప్రమత్తంగా ఉండాలని, కొత్తగా ఏర్పాటు చేస్తున్న ప్లాంటేషన్ పనులపై శ్రద్ధ పెట్టాలని సీసీఎఫ్ భీమానాయక్ అన్నారు. బుధవారం ఆయన అశ్వారావుపేట అటవీ రేంజ్ పరిధిలోని వేదాంతపురం, ఊట్లపల్లి, అశ్వారావుపేట బీట్ పరిధిలో చేపట్టిన అభివృద్ధి పనులను తనిఖీ చేశారు. వేదాంతపురం బీట్‌లో కూలీలకు ఇస్తున్న వెదురు కోత శిక్షణ కార్యక్రమాన్ని పరిశీలించారు. కోత సమయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై పలు సూచనలు చేశారు. ఊట్లపల్లి సమీపంలో దాదాపు 50 ఎకరాల్లో జరుగుతున్న అటవీ అభివృద్ధి పనులను పరిశీలించి వేగవంతం చేయాలని సిబ్బందిని ఆదేశించారు. అనంతరం మాట్లాడుతూ.. నాలుగు లక్షల వెదురు మొక్కలను పెంచేలా లక్ష్యంగా పెట్టుకున్నామని, ఈ లక్ష్యాన్ని వచ్చే జూలై నెలాఖరు నాటికి చేరుకుంటామని తెలిపారు. నిఘా మరింత పటిష్టం చేస్తామని, కొత్తగా పోడు నరికితే కఠిన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. విధుల పట్ల సిబ్బంది నిర్లక్ష్యం చేస్తే సహించేది లేదని, అలాంటి వారిపై చర్యలు తప్పవని హెచ్చరించారు. కార్యక్రమంలో డీఎఫ్ఓ కృష్ణాగౌడ్, ఎఫ్‌డీఓ దామోదర్ రెడ్డి, రేంజర్ మురళి తదితరులు పాల్గొన్నారు.



ప్లాంటేషన్ పనులను పరిశీలిస్తున్న భీమా నాయక్

క్లుప్తంగా

కోరం పుల్లయ్యకు తుమ్మల నివాళి



పుల్లయ్యకు నివాళులర్పిస్తున్న రాష్ట్ర మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, ఎమ్మెల్యేలు, నాయకులు

టేకులపల్లి: ఇల్లెందు ఎమ్మెల్యే కోరం కనకయ్య తండ్రి కోరం పుల్లయ్యకు రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, ఎమ్మెల్యేలు కూనంనేని సాంబశివరావు, భూక్య మురళీనాయక్, మాళోతు రాందాస్‌నాయక్ తదితరులు నివాళులర్పించారు. పుల్లయ్య ఈ నెల 2న అనారోగ్యంతో మృతి చెందగా, బుధవారం కోయగూడెం గ్రామంలో సంస్మరణ కార్యక్రమం నిర్వహించారు. నివాళులర్పించిన వారిలో ఖమ్మం జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు పువ్వాళ్ల దుర్గాప్రసాద్, జెన్నారెడ్డి భరత్‌చంద్రారెడ్డి, మూల మధుకర్‌రెడ్డి, కనగాల పేరయ్య, సాబీర్ పాషా, వల్లాల శ్రీనివాస్, అయిత విశ్వేశ్వరరావు, పీఏజీ శేఖర్‌రాజు ఉన్నారు.

2న బెంచ్‌ప్రెస్ పోటీలు

భద్రాచలంటౌన్: ఉమ్మడి ఖమ్మం జిల్లా స్థాయి బెంచ్ ప్రెస్ పోటీలను జూన్ 2న ఖమ్మంలో నిర్వహిస్తున్నట్లు జిల్లా పవర్ లిఫ్టింగ్ అసోసియేషన్ అధ్యక్షుడు భోగాల శ్రీనివాసరెడ్డి, జనరల్ సెక్రెటరీ జీవీ రామిరెడ్డి, జాయింట్ సెక్రెటరీ డాక్టర్ కృష్ణ ప్రసాద్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. పోటీల్లో జూనియర్, సీనియర్, మాస్టర్స్, మహిళా క్రీడాకారులు పాల్గొనవచ్చని పేర్కొన్నారు. పోటీలో పాల్గొనే క్రీడాకారులు రూ.300 ఎంట్రీ ఫీజు చెల్లించడంతోపాటు తప్పనిసరిగా ఆధార్ కార్డు తీసుకు రావాలని, పాల్గొనే క్రీడాకారులకు ఉచిత అల్పాహారం, భోజన సదుపాయం కల్పిస్తామని వివరించారు.

నగల చోరీపై కేసు నమోదు

దమ్మపేట: వివాహ వేడుకలో బంగారు నగలు చోరీ చేసిన ఘటనపై పోలీసులు బుధవారం కేసు నమోదు చేశారు. పోలీసుల కథనం ప్రకారం... దమ్మపేట గ్రామంలోని వినాయక ఫంక్షన్ హాల్‌లో ఈ నెల 10న అదే గ్రామానికి చెందిన మహ్మద్ అస్మీలా వివాహ వేడుక జరిగింది. ఈ వేడుకలో అస్మీలాకు చెందిన బంగారు నెక్లెస్, బ్రాస్‌లెట్, ఉంగరం, చైన్లు కలిపి మొత్తంగా 50 గ్రాముల నగలు చోరీకి గురయ్యాయి. వీటి విలువ సుమారు రూ.2 లక్షలు ఉంటుంది. బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై సాయికిషోర్‌రెడ్డి తెలిపారు.

ట్రాలీ ఢీకొని ఒకరికి గాయాలు

ఇల్లెందురూరల్: మండలంలోని కొమరారం గ్రామసమీపంలో బుధవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తికి తీవ్రంగా గాయాలయ్యాయి. సీపీఐ(ఎంఎల్) మాస్‌లైన్ పార్టీ నాయకుడు ఆజాద్‌కు రొంపేడు నుంచి కొమరారం మీదుగా గుండాల వైపు బైక్‌పై వెళ్తున్నాడు. ఈ క్రమంలో ఎదురుగా వస్తున్న ట్రాలీ బైక్‌ను ఢీకొనడంతో ప్రమాదం జరిగింది. దీంతో ఆజాద్‌కు తీవ్ర గాయాలు కాగా, చికిత్స నిమిత్తం ఇల్లెందు ప్రభుత్వ ఆస్పత్రికి, అక్కడి నుంచి మెరుగైన వైద్యం కోసం ఖమ్మం తరలించారు.

పందెంరాయుళ్ల అరెస్ట్

ములకలపల్లి: కోడిపందేలు వేస్తున్న నలుగురు వ్యక్తులను బుధవారం పోలీసులు అరెస్ట్ చేశారు. ఎస్సై రాజమౌళి కథనం ప్రకారం.. మండల పరిధిలోని రంగాపురం గ్రామ శివారులో కోడిపందేలు నిర్వహిస్తుండగా పోలీసులు దాడి చేశారు. నలుగురు వ్యక్తులను అరెస్ట్ చేశారు. నాలుగు కోడిపుంజులు, రూ.2 వేల నగదును స్వాధీనం చేసుకున్నారు. కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

వ్యక్తి అదృశ్యం

అన్నపురెడ్డిపల్లి: వ్యక్తి అదృశ్యంపై పోలీసులు బుధవారం కేసు నమోదు చేశారు. పోలీసుల కథనం ప్రకారం.. మండలంలోని గుంపెన గ్రామానికి చెందిన వేముల అమర్నాథ్ మంగళవారం ఉదయం ఇంటి నుంచి బయటకు వెళ్లాడు. మధ్యాహ్న సమయంలో తన భార్యకు వాట్సాప్ కాల్ చేసి తన ద్విచక్రవాహనాన్ని వీఎం బంజర్ బస్టాండ్‌లో పెట్టి వెళ్తున్నానని, తన కోసం వెతకొద్దని చెప్పి ఫోన్ స్విచ్ఛాఫ్ చేసుకున్నాడు. అమర్నాథ్ భార్య మౌనిక ఫిర్యాదు మేరకు ఏఎస్సై అంజయ్యకేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

కాంగ్రెస్ నాయకుడిపై అట్రాసిటీ కేసు

అశ్వారావుపేటరూరల్: మండలంలోని అనంతారం గ్రామానికి చెందిన కాంగ్రెస్ నాయకుడు ఆరేపల్లి సూరిబాబుపై బుధవారం అట్రాసిటీ కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ శివరామకృష్ణ తెలిపారు. ఈనెల 13న పార్లమెంట్ ఎన్నికల సందర్భంగా పోలింగ్ కేంద్రం వద్ద సెల్‌ఫోన్‌లో మాట్లాడుతూ తిరుగుతుండగా, క్యూలో ఉన్న బీఆర్‌ఎస్ కార్యకర్త గీగా నవీన్ అతడిని ప్రశ్నించాడు. దీంతో సూరిబాబు సెల్‌ఫోన్‌ను అక్కడే విధుల్లో ఉన్న కానిస్టేబుల్ స్వాధీనం చేసుకున్నాడు. ఈ ఘటనతో ఆగ్రహించిన సూరిబాబు తనను కులం పేరుతో దూషించడంతో పాటు బెదిరించాడని నవీన్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఈ ఘటనపై విచారణ చేసి సూరిబాబుపై అట్రాసిటీ కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు.

ప్రభుత్వాస్పత్రిలో ఇంటి దొంగలు..!

- దాతలు ఇచ్చిన రూ. లక్షల విలువైన సామగ్రి మాయం?
- మణుగూరు 100 పడకల ఆస్పత్రిపై పర్యవేక్షణ కరువు



మణుగూరు 100 పడకల ఆస్పత్రి

మణుగూరు టౌన్: మణుగూరు 100 పడకల ఆస్పత్రిలో ఇంటి దొంగలు సామగ్రి చోరీ చేసి విక్రయిస్తున్నారనే ఆరోపణలు వ్యక్తమవుతున్నాయి. అధికారుల పర్యవేక్షణ లేకపోవడంతో భద్రత డొల్లగా మారింది. తాత్కాలికంగా పక్కకు ఉంచిన రూ.లక్షల విలువైన సొత్తు, మరమ్మతులకు గురైన విలువైన పరికరాలు మాయమవుతున్నట్లు తెలుస్తోంది. కరోనా సమయంలో కార్పొరేట్ వైద్యానికి దీటుగా ఇక్కడ వైద్యసేవలందించారు. అనంతరం వరదల ముంపు సమయంలో పాముకాటుకు కూడా మెరుగైన సేవలందించారు. దీంతో దాతలు స్పందించి, ఆస్పత్రిలో వసతుల లేమిని గుర్తించి సాయమందించారు. మణుగూరు, పినపాక, అశ్వాపురం, పాల్వంచ మండలాల నుంచి కుర్చీలు, ఏసీలు, ఫ్రిజ్‌లు, ఫ్యాన్లు.. దానం చేసి దాతృత్వం చాటుకున్నారు. అయితే ఇప్పుడవి కిందిస్థాయి సిబ్బంది చేతివాటంతో పక్కదారి పట్టాయని తెలుస్తోంది. రూ. లక్షల విలువైన సొమ్ము దర్జాగా రాత్రి వేళల్లో ఆటోల్లో తరలించుకుపోయినట్లు ఆరోపణలు వ్యక్తమవుతున్నాయి.

అధికారులు మారితే అంతే

2022 సంవత్సరంలో మణుగూరులోని ప్రముఖ వ్యాపారి ఇచ్చిన 1.5 టన్నుల ఏసీతో పాటు సీలింగ్ ఫ్యాన్లు, దాతలు ఇచ్చిన కుర్చీలు, లైట్లు, పాత మంచాలను చోరీ చేసినట్లు తెలుస్తోంది. అసెంబ్లీ ఎన్నికల అనంతరం ప్రభుత్వం మారిన సందర్భంలో ఏకంగా రాత్రి సమయంలో 12 మంచాలు దర్జాగా ట్రాలీలో తీసుకెళ్లి విక్రయించారనే ఆరోపణలున్నాయి. వైద్యాధికారులు మారిన సమయంలో కింది స్థాయి సిబ్బంది చేతివాటం ప్రదర్శిస్తూ దర్జాగా బయట అమ్ముకుంటున్నారనే ఆరోపణలు వ్యక్తమవుతున్నాయి. ఇప్పటికైనా జిల్లా వైద్యాధికారులు దృష్టి సారించి ఆస్పత్రిని గాడిలో పెట్టాలని స్థానికులు కోరుతున్నారు.



ఆస్పత్రికి కుర్చీలు వితరణ చేస్తున్న దాతలు (ఫైల్)

సామగ్రి వివరాలు పరిశీలిస్తాం..



ఆస్పత్రిలో అన్ని గదుల్లో సరిపోనూ కుర్చీలు ఉన్నాయి. దీంతో అవి ఏ విధంగా వచ్చాయనే విషయంపై పెద్దగా దృష్టి సారించలేదు. డొనేషన్ల ద్వారా వచ్చిన కుర్చీలు, ఫ్యాన్లు, లెక్కలు తెప్పించి చూస్తాం. మంచాలు కొన్ని ఎక్స్‌రే రూం దగ్గర ఉంచాం. అవి మొత్తం ఎన్ని ఉండాలి. ఇప్పుడు ఎన్ని ఉన్నాయనేది పరిశీలిస్తాం.

–సునీల్, ఆస్పత్రి సూపరింటెండెంట్

అమ్మో ఇవేం పరీక్షలు..?

- ఆర్టీసీ ఉద్యోగుల వైద్యపరీక్షల ఫలితాలతో బెంబేలు
- బీపీ, షుగర్ లేకున్నా ఉన్నట్లు నివేదికలు
- ఆందోళన వ్యక్తం చేస్తున్న ఉద్యోగులు

ఖమ్మంమయూరిసెంటర్: కార్మికులు, ఉద్యోగుల ఆరోగ్య పరిరక్షణ కోసం ఆర్టీసీ గ్రాండ్ హెల్త్ చాలెంజ్ పేరిట వైద్యపరీక్షలు నిర్వహిస్తోంది. ఆర్టీసీలో అధికారులు మొదలు కింది స్థాయి శ్రామికుల వరకు అందరికీ గతంలో ఓమారు వైద్య పరీక్షలు చేయించగా.. గ్రాండ్ హెల్త్ చాలెంజ్ – 2.0 పేరుతో మరోమారు ఓ ప్రైవేట్ సంస్థ ఆధ్వర్యాన పరీక్షలు కొనసాగుతున్నాయి. సంస్థ ఆలోచన మంచిదే అయినా వైద్య పరీక్షల అనంతరం వస్తున్న నివేదికలు చూసి సిబ్బంది బెంబేలెత్తుతున్నారు. ఆరోగ్యంగా ఉన్న తమకు అనారోగ్యం ఉందని రిపోర్టుల్లో రావడంతో ప్రైవేట్ ఆస్పత్రులకు వెళ్లి పరీక్షలు చేయించుకుంటే ఏమీ లేదని తేలుతుండగా ఊపిరి పీల్చుకుంటున్నారు.

నివేదికలతో ఆందోళన

గ్రాండ్ హెల్త్ చాలెంజ్ ద్వారా ఖమ్మం రీజియన్‌లోని ఖమ్మం, సత్తుపల్లి, మధిర, భద్రాచలం డిపోల పరిధిలో ఉద్యోగులకు వైద్యపరీక్షలు పూర్తి కాగా, ఖమ్మం డిపోలో పరీక్షలు చేయించుకున్న వారందరికీ నివేదికలు అందజేశారు. అయితే చాలామందికి సరైన ఫలితం రాలేదని తెలుస్తోంది. ఓ కండక్టర్‌కు షుగర్, బీపీ లేకున్నా ఉన్నట్లు నివేదిక ఇచ్చారు. దీంతో సదరు ఉద్యోగి మరోసారి ఖమ్మంలోని ప్రైవేట్ ఆస్పత్రిలో పరీక్ష చేయించుకుంటే అంతా సాధారణంగా ఉన్నట్లు తేలడంతో ఊపిరి పీల్చుకున్నాడు. ఇక ఓ అధికారి వద్ద పని చేసే సిబ్బంది క్రియాటిన్ పరీక్ష చేయించుకోగా 1.7 ఉన్నట్లు ఆర్టీసీ వైద్య పరీక్షల్లో తేలింది. ఆయన ఆందోళనతో బయట పరీక్ష చేయించుకోగా నార్మల్‌గా ఉందని, 0.8 గానే ఉందని వచ్చింది. ఇలా పలువురికి నివేదికల్లో తేడాలు ఉండగా.. లేని వ్యాధులు ఉన్నట్లు నివేదిక ఇవ్వడం ఏమిటనే చర్చ జరుగుతోంది.

నాలుగు డిపోల పరిధిలో పూర్తి

ఖమ్మం ఆర్టీసీ రీజియన్‌లో ఏడు డిపోలు ఉండగా.. ఇప్పటి వరకు ఖమ్మం, సత్తుపల్లి, మధిర, భద్రాచలం డిపోల పరిధిలో గ్రాండ్ హెల్త్ చాలెంజ్ – 2.0 ద్వారా వైద్యపరీక్షలు పూర్తయ్యాయి. మణుగూరు, కొత్తగూడెం, ఇల్లెందు డిపోల పరిధిలో రెండు, మూడు రోజుల్లో పరీక్షలు ప్రారంభించనున్నారు. ఇప్పటి వరకు జరిగిన తప్పిదాలను పరిగణనలోకి తీసుకుని మిగతాచోట్ల జాగ్రత్త వహించాలని ఉద్యోగులు కోరుతున్నారు. ఈ అంశంపై ఆర్టీసీ అధికారులను వివరణ కోరగా.. వైద్య పరీక్షలకు సంబంధించి ఇప్పటి వరకు అందిన నివేదికలను పరిశీలించామని, మరోమారు పరిశీలిస్తున్నామని తెలిపారు.

శాంపిల్స్ ఇక్కడ.. పరీక్షలు అక్కడ

ఆర్టీసీలో ఉద్యోగులకు వైద్య పరీక్షలు నిర్వహించే బాధ్యతలను హైదరాబాద్‌కు చెందిన ఓ సంస్థకు అప్పగించారు. అయితే, ఇక్కడ ఉద్యోగులు, సిబ్బంది నుంచి రక్త నమూనాలను హైదరాబాద్ పంపించి పరీక్షలు చేయిస్తున్నారు. ఈ క్రమంలో సమయం పడుతుండగా, శాంపిల్స్ భద్రపరచడంలో తగిన జాగ్రత్తలు తీసుకోకపోవడంతో నివేదికల్లో తేడా వచ్చే అవకాశముందని తెలుస్తోంది. ఏదిఏమైనా తప్పుడు నివేదికలతో తాము మానసికంగా ఇబ్బంది పడకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని ఉద్యోగులు కోరుతున్నారు.

బుక్ ఆఫ్ ఇంటర్నేషనల్‌కు ఎంపిక



నవ్యశ్రీ

చంద్రుగొండ : బుక్ ఆఫ్ ఇంటర్నేషనల్‌కు చంద్రుగొండకు చెందిన తేజావత్ నవ్యశ్రీ ఎంపికైంది. మండలంలోని దామరచర్ల ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయుడు తేజావత్ శ్రీరాములు కుమార్తె నవ్యశ్రీ కళ్లకు గంతలు కట్టుకుని 71 సెకన్లలో అల్ఫాబెటికల్ పద్ధతిన 195 దేశాల పేర్లను చెప్పింది. ఆమె చదివిన దేశాల పేర్లను వీడియో తీసి ఇంటర్నేషనల్ బుక్ ఆఫ్ రికార్డ్‌కు ఇటీవల పంపించారు. దీంతో ఇంటర్నేషనల్ బుక్ ఆఫ్ రికార్డ్స్ బాధ్యులు వీడియోను పరిశీలించి నవ్యశ్రీ పేరును రికార్డ్స్‌లో నమోదు చేసినట్లు బుధవారం సమాచారం పంపించినట్లు తండ్రి శ్రీరాములు తెలిపారు. ఈ సందర్భంగా నవ్యశ్రీని పలువురు అభినందించారు.

సింగరేణి ఎక్స్‌టర్నల్ పోస్టులకు దరఖాస్తుల స్వీకరణ

సింగరేణి(కొత్తగూడెం): సింగరేణి సంస్థలో ఉద్యోగాల(ఎక్స్‌టర్నల్) భర్తీకి ఈ ఏడాది ఫిబ్రవరిలో నోటిఫికేషన్ విడుదల చేయగా దరఖాస్తులకు బుధవారం ఆన్‌లైన్ పోర్టల్ అందుబాటులోకి వచ్చింది. ఈ మేరకు అభ్యర్థులు జూన్ 4వ తేదీ సాయంత్రం 5 గంటల వరకు ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవచ్చు. కాగా, ఈ ఈ నోటిఫికేషన్‌కు సంబంధించి ఆన్‌లైన్ ప్రక్రియ గత నెల 15వ తేదీనే ప్రారంభమవుతుందని తొలుత చెప్పినా నెల తర్వాత మొదలైంది. ఇందులో రెండు రకాల ఎగ్జిక్యూటివ్ కేడర్ పోస్టులు 327 ఉన్నాయి. పూర్తి వివరాల కోసం అభ్యర్థులు www. scclmines. com వెబ్‌సైట్‌ను సంప్రదించాలని అధికారులు సూచించారు.

మొదటి నోటిఫికేషన్ పరీక్షలు జూన్‌లో..

సింగరేణి యాజమాన్యం ఎక్స్‌టర్నల్ పోస్టుల భర్తీ కోసం మొదటి దఫా విడుదల చేసిన నోటిఫికేషన్‌లో రాతపరీక్షలు జూన్ చివరివారంలో నిర్వహించనున్నట్లు తెలుస్తోంది. ఇందులో 16 నాన్ ఎగ్జిక్యూటివ్ పోస్టులు, 256 ఎగ్జిక్యూటివ్ పోస్టులు ఉండగా, ఈ ఉద్యోగాల భర్తీకి సింగరేణి సంస్థ తొలిసారిగా ఆన్‌లైన్‌లో నిర్వహించడానికి సిద్ధమవుతోంది. గతంలో జరిగిన పరీక్షల్లో పలు అవకతవకలు జరిగిన నేపథ్యాన ఈసారి పకడ్బందీ ఏర్పాట్లు చేస్తున్నారు.

దళారులను నమ్మకండి..

సింగరేణి సంస్థలో చాలాకాలం తర్వాత రెండు నోటిఫికేషన్లు విడుదలైన నేపథ్యాన ఆసక్తి, అర్హత కలిగిన అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవాలని సీఎండీ బలరామ్ ఒక ప్రకటనలో సూచించారు. రోజుకు సుమారు పది గంటలు కష్టపడి చదివితే ఉద్యోగం వచ్చే అవకాశముందని చెప్పారు. అయితే, అభ్యర్థులు స్వశక్తిని నమ్ముకోవాలి తప్ప దళారులను ఆశ్రయించి మోసపోవద్దని ఆయన హితవు పలికారు.

మందుపాతర పేల్చిన మావోయిస్టులు

- సీఐ, ఇద్దరు కానిస్టేబుళ్లకు స్వల్ప గాయాలు
- ఛత్తీస్‌గఢ్‌లోని బీజాపూర్ జిల్లాలో ఘటన



మందుపాతర పేల్చడంతో ముందుభాగం దెబ్బతిన్న కారు

చర్ల: మావోయిస్టులు మందుపాతర పేల్చడంతో సీఐతో పాటు మరో ఇద్దరు కానిస్టేబుళ్లు స్వల్పంగా గాయపడిన ఘటన ఛత్తీస్‌గఢ్ రాష్ట్రంలోని బీజాపూర్ జిల్లాలో బుధవారం చోటుచేసుకుంది. బీజాపూర్ జిల్లా పార్సేఘడ్ పోలీస్ స్టేషన్ ఇన్‌చార్జ్ (సీఐ) ఆకాష్ మసీహ్ ఇద్దరు కానిస్టేబుళ్లతో కలిసి కారులో పార్సేఘడ్ నుంచి బీజాపూర్‌కు వస్తుండగా సోమన్‌పల్లి–రాణిబొద్లి గ్రామాల మధ్య అటవీ ప్రాంతంలోని రహదారిపై అమర్చిన మందుపాతరను మావోయిస్టులు పేల్చారు. ఈ ఘటనలో కారు ముందు భాగం మాత్రమే దెబ్బతినడంతో పెను ప్రమాదం తప్పింది. సీఐ, కానిస్టేబుళ్లు స్వల్ప గాయాలతోనే బయటపడ్డారు. సమాచారం అందుకున్న పోలీసులు వెంటనే అక్కడికి చేరుకుని క్షతగాత్రులను ఆస్పత్రికి తరలించారు. మందుపాతర పేల్చిన ప్రాంతంలో కూంబింగ్ ముమ్మరం చేసినట్లు ఎస్పీ జితేంద్రకుమార్ యాదవ్ తెలిపారు. ఈ ఘటనతో బీజాపూర్ జిల్లాలోని అన్ని ప్రధాన రహదారుల్లో బాంబు, డాగ్ స్క్వాడ్ బృందాలు తనిఖీలు చేపట్టాయి.

డీసీఎంఎస్ మాజీ చైర్మన్ రాయల మృతి

- తల్లాడ తొలి ఎంపీపీగా సేవలు
- సంతాపం ప్రకటించిన మాజీ సీఎం కేసీఆర్, ప్రజాప్రతినిధులు



రాయల వెంకట శేషగిరిరావు (ఫైల్)



రాయల మృతదేహం వద్ద నివాళులర్పిస్తున్న ఎమ్మెల్సీ మధు, జెడ్పీ చైర్మన్ కమల్‌రాజ్, మాజీ ఎమ్మెల్యేలు సండ్ర, కొండబాల

తల్లాడ: డీసీఎంఎస్ మాజీ చైర్మన్ రాయల వెంకటశేషగిరిరావు(69) అనారోగ్యంతో బాధపడుతూ మృతి చెందారు. కొంతకాలంగా ఆయన లివర్ సంబంధిత వ్యాధితో బాధపడుతుండగా హైదరాబాద్ యశోద ఆస్పత్రిలో చికిత్స చేయిస్తున్నారు. ఈ నేపథ్యాన బుధవారం ఆరోగ్యం విషమించగా కన్నుమూశారు. శేషగిరిరావుకు భార్య, ఇద్దరు కుమారులు ఉండగా, చిన్న కుమారుడు అమెరికాలో, పెద్ద కుమారుడు హైదరాబాద్‌లో ఉంటున్నారు.

యూత్ కాంగ్రెస్ నుంచి మొదలు..

తల్లాడ మండలం మిట్టపల్లికి చెందిన రాయల శేషగిరిరావు 1978లో యూత్ కాంగ్రెస్ నుంచి రాజకీయ ప్రస్థానం ప్రారంభించారు. ఆపై 1982లో టీడీపీలో చేరగా, ఎన్టీఆర్, లక్ష్మీపార్వతి, దగ్గుబాటి వెంకటేశ్వరరావుతో సన్నిహిత సంబంధాలు ఉండేవి. 1987లో తల్లాడ తొలి ఎంపీపీగా ప్రత్యక్ష ఎన్నికల్లో గెలిచిన ఆయన మండల అభివృద్ధికి పాటుపడ్డారు. ఆ తర్వాత 1997 నుంచి వరుసగా మూడుసార్లు గంగదేవిపాడు సొసైటీ చైర్మన్‌గా గెలిచి హ్యాట్రిక్ సాధించాడు. 2013లో డీసీసీబీ డైరెక్టర్‌గా ఎన్నికైన ఆయన 2019లో సండ్ర వెంకటవీరయ్యతో పాటే బీఆర్‌ఎస్‌లో చేరారు. 2020 ఫిబ్రవరిలో డీసీఎంఎస్ చైర్మన్‌గా ఎన్నిక కాగా.. మూన్నెళ్ల క్రితం పదవి కోల్పోయారు. కాగా, లక్ష్మీపార్వతి పార్టీ తరఫున మధిర నుంచి ఓసారి ఎమ్మెల్యేగా పోటీ చేసినా ఓడిపోయారు.

రాయల మృతి తీరని లోటు

డీసీఎంఎస్ మాజీ చైర్మన్ శేషగిరిరావు మృతి తీరని లోటని పలువురు ప్రజాప్రతినిధులు, నాయకులు పేర్కొన్నారు. ఆయన మరణ వార్త తెలిసిన వెంటనే హైదరాబాద్ యశోద ఆస్పత్రిలో ఎమ్మెల్సీ తాతా మధుసూదన్, జెడ్పీ చైర్మన్ లింగాల కమల్‌రాజు, మాజీ ఎమ్మెల్యేలు సండ్ర వెంకటవీరయ్య, కొండబాల కోటేశ్వరరావు తదితరులు నివాళులర్పించారు. అలాగే, ఆయన మృతిపై మాజీ సీఎం కేసీఆర్, మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు, మాజీ మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్, ఎంపీలు బండి పార్థసారధిరెడ్డి, వద్దిరాజు రవిచంద్ర, మాజీ నామా నాగేశ్వరరావు, డీసీఎంఎస్ చైర్మన్ కొత్వాల శ్రీనివాసరావు, డైరెక్టర్ నాగుబండి శ్రీనివాసరావు, తల్లాడ ఎంపీపీ దొడ్డా శ్రీనివాసరావు, జెడ్పీటీసీ దిరిశాల ప్రమీల, తల్లాడ, సొసైటీల చైర్మన్లు రెడ్డెం వీరమోహన్‌రెడ్డి, తూము వీరభద్రరావు, నాయకులు వెంకట్‌లాల్, శెట్టిపల్లి లక్ష్మణ్‌రావు, మువ్వా మురళి, కేతినేని చలపతిరావు, శ్రీనివాసరావు తదితరులు సంతాపం ప్రకటించారు. కాగా, రాయల మృతదేహాన్ని బుధవారం రాత్రి స్వ గ్రామమైన మిట్టపల్లికి తీసుకొచ్చారు.

బొగ్గు ఉత్పత్తిలో జేకే ఓసీ భేష్

ఇల్లెందు: బొగ్గు ఉత్పత్తిలో ఇల్లెందు ఏరియాలోని జేకే ఓసీ జాతీయ స్థాయిలో ఉత్తమ రేటింగ్ సాధించింది. ఆలిండియా స్థాయిలో ఓపెన్‌కాస్ట్ మైనింగ్‌పై రేటింగ్ నిర్వహించగా, ఇల్లెందు ఏరియాకు ఐదు స్టార్లు లభించాయని ఏఐటీయూసీ డిప్యూటీ ప్రధాన కార్యదర్శి కె.సారయ్య తెలిపారు. ఉత్తమ రేటింగ్ సాధనకు కృషి చేసిన కార్మికులు, ఉద్యోగులు, అధికారులకు ఆయన అభినందనలు తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో దంపతులు మృతి

- కొడుకు వద్దకు వెళ్తూ అనంతలోకాలకు..
- పూర్తిగా కాలిపోయిన కారు..
- మృతుల మనవడు, కేర్ టేకర్‌కు తీవ్రగాయాలు



సూర్యనారాయణ – రుక్మిణి (ఫైల్)

బోనకల్: కుమారుడి వద్దకు వెళ్తున్న వృద్ధ దంపతులకు అదే ఆఖరి ప్రయాణమైంది. వీరు ప్రయాణిస్తున్న కారు అదుపు తప్పి రహదారి పక్కన చెట్టు ను ఢీకొట్టడంతో తీవ్ర గాయాలతో అక్కడికక్కడే మృతి చెందగా మరో ఇద్దరు గాయపడ్డారు. వివరాలు.. ఏపీలోని కృష్ణా జిల్లా గంపలగూడెం మండలం పెనుగొలను గ్రామానికి చెందిన కొత్తూరు సూర్యనారాయణ (92) డిగ్రీ కళాశాలలో లెక్చరర్‌గా పనిచేసి ఉద్యోగ విరమణ చేశారు. ఆయన భార్య రుక్మిణి (85)తో మధిరలోనే స్థిరపడ్డారు. వీరికి ముగ్గురు కుమారులు, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. వృద్ధాప్యం కారణంగా వీరి సంరక్షణ కోసం ఒక కేర్‌టేకర్‌ను నియమించడంతో మధిరలో ఉంటున్న ఒక కుమారుడు, ఖమ్మంలో ఉంటున్న ఇద్దరు కుమారుల వద్ద కొన్నేసి రోజులు నివసిస్తున్నారు. ఇదే క్రమంలో బుధవారం మధిర నుంచి ఖమ్మంలో ఉంటున్న పెద్దకుమారుడి వద్దకు మనవడు కొత్తూరు అనిల్, కేర్‌టేకర్ నాగరాజుతో కలిసి బయలుదేరారు. కారును అనిల్ నడిపిస్తుండ గా ఎదురుగా వస్తున్న వాహనాన్ని తప్పించబోయి రోడ్డు పక్కన ఉన్న చెట్టును ఢీకొట్టాడు. ఈ ఘటనలో సూర్యనారాయణ – రుక్మిణి తీవ్రగాయాలతో అక్కడికక్కడే మృతి చెందగా మనవడు అనిల్, కేర్‌టేకర్ నాగరాజుకు తీవ్ర గాయాలయ్యాయి.

కారుకు లాక్.. 108 సిబ్బంది సమయస్ఫూర్తి

ప్రమాద సమయాన కారు అతి వేగంగా వెళ్తున్నట్లు తెలుస్తుండగా, చెట్టును బలంగా ఢీకొట్టింది. దీంతో స్థానికులు 108కు సమాచారం అందించగా వాహనం సమీపాన ముష్టికుంట్లలోనే ఉండటంతో అక్కడకు వచ్చేలోగా కారుకు మంటలు వ్యాపించాయి. ఆపై కారు లాక్ అయి తలుపులు తెరుచుకోకపోవడంతో 108 సిబ్బంది వెంకట్రావు, ఈఎంటీ రామకృష్ణ స్థానికుల సహకారం తీసుకుని గునపంతో కారు తలుపులు పగులగొట్టి స్టీరింగ్ వద్ద ఇరుక్కుపోయిన అనిల్, మిగతా వారిని బయటకు తీశారు. అప్పటికే సూర్యనారాయణ – రుక్మిణి దంపతులు మృతి చెందగా నాగరాజు, అనిల్‌కు తీవ్రగాయాలు కావడంతో ఖమ్మం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. 108 సిబ్బంది వెంకట్రావు, ఈఎంటీ చాకచక్యంగా వ్యవహరించకపోతే మృతులతో పాటు క్షతగాత్రులు సజీవ దహనం అయ్యేవారని తెలుస్తోంది. ఘటన సమాచారం అందుకున్న మధిర సీఐ మధు, బోనకల్ ఎస్‌ఐ మధుబాబు పరిశీలించి కేసు దర్యాప్తు ప్రారంభించారు.

గుండెపోటుతో మైనారిటీ నాయకుడి మృతి

చంద్రుగొండ : మండలంలోని తిప్పనపల్లి గ్రామానికి చెందిన మైనారిటీ మండల నాయకుడు ఎస్డీ యుసుఫ్‌మియా (60) బుధవారం గుండెపోటుతో మృతి చెందాడు. మైనారిటీల సమస్యల పట్ల అలుపెరుగని పోరాటం చేసిన ఆయన హఠాన్మరణం మైనారిటీలకు తీరని లోటని పలువురు పేర్కొన్నారు. ఆయన మృతి పట్ల సంతాపం తెలిపారు. మృతుడికి భార్య, ముగ్గురు పిల్లలు ఉన్నారు.

చెట్టును ఢీకొట్టిన కారు

మణుగూరు రూరల్ : మండల పరిధిలోని సాంబాయిగూడెం గుట్ట ప్రాంతంలో కారు చెట్టును ఢీకొట్టిన సంఘటన బుధవారం జరిగింది. స్థానికుల కథనం ప్రకారం.. మణుగూరు నుంచి బీటీపీఎస్ వైపు వెళ్తున్న క్రమంలో కారు మరో వాహనాన్ని తప్పించబోయి అదుపుతప్పి చెట్టును ఢీకొట్టింది. ఈ ఘటనలో ఎయిర్ బెలూన్స్ ఓపెన్ కావడంతో కారులో ప్రయాణిస్తున్న వారికి స్వల్ప గాయాలైనట్లు తెలిసింది. కాగా ప్రమాదానికి సంబంధించి పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

సింగరేణి ఉద్యోగి ఇంట్లో చోరీ

కొత్తగూడెంటౌన్: కొత్తగూడెంలోని సింగరేణి హెడాఫీస్ సమీపంలో క్వార్టర్స్‌లో నివాసముంటున్న ఓ ఉద్యోగి ఇంట్లో బంగారం, వెండి ఆభరణాలను చోరీ చేశారు. వన్‌టౌన్ పోలీసుల కథనం ప్రకారం.. ఈ నెల 12న సింగరేణి ఉద్యోగి ఎం.కుటుంబరావు కుటుంబ సభ్యులతో కలిసి ఖమ్మం వెళ్లారు. తిరిగి బుధవారం ఇంటికి రాగా ఇంట్లోని వస్తువులు అన్నీ కింద పడి ఉండడం, బీరువాలోని రెండు తులాల బంగారం, 10 తులాల వెండి వస్తువులు చోరీకి గురైనట్లు గుర్తించారు. బాధితుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

భార్యను వేధిస్తున్న భర్తపై కేసు నమోదు

అశ్వారావుపేటరూరల్: భార్యను వేధిస్తున్న భర్తపై పోలీసులు బుధవారం కేసు నమోదు చేశారు. ఎస్‌ఐ శివరామకృష్ణ కథనం ప్రకారం.. మండలంలోని మద్దికొండ గ్రామానికి చెందిన నాగలక్ష్మికి 2009లో ఇదే మండలంలోని తిరుమలకుంట గ్రామానికి చెందిన మొడియం సాగర్‌తో వివాహమైంది. ఈ దంపతులకు ఇద్దరు సంతానం. కాగా కొంతకాలంగా సాగర్ మద్యానికి, జూదానికి అలవాటు పడ్డాడు. మూడు రోజుల క్రితం భార్యతో గొడవపడి, దాడికి పాల్పడ్డాడు. బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు ఎస్‌ఐ తెలిపారు.

వేధింపుల కేసు నమోదు

అశ్వారావుపేటరూరల్: కట్నం కోసం భార్యను వేధి స్తున్న భర్తపై పోలీసులు బుధవారం కేసు నమోదు చేశారు. ఎస్‌ఐ శివరామకృష్ణ కథనం ప్రకారం.. మండలంలోని గుమ్మడవల్లి గ్రామానికి చెందిన కొప్పుల కుమారిని అదే గ్రామానికి చెందిన నరసింహారెడ్డి సుమారు రెండేళ్ల క్రితం ప్రేమించి పెళ్లి చేసుకున్నాడు. ఈ దంపతులకు కుమారుడు జన్మించా డు. కాగా కొంత కాలంగా కట్నం తీసుకురావాలని నరసింహారెడ్డి వేధింపులకు గురిచేస్తున్నాడు. బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు ఎస్‌ఐ తెలిపారు.

వ్యక్తిపై మామ, బావమరుదుల దాడి

పాల్వంచ: కూతురిని ఇబ్బంది పెడుతుండటంతో వ్యక్తిపై అతని మామ, బావమరుదులు బుధవారం దాడికి పాల్పడ్డారు. పోలీసుల కథనం ప్రకారం.. పట్టణంలోని జగ్గతండాకు చెందిన భూక్యా రమేశ్, మంజుల భార్యాభర్తలు. కాగా తరచు వారి మధ్య గొడవలు జరుగుతున్నాయి. ఈ క్రమంలో తన కూతురిని ఇబ్బంది పెడుతున్నాడనే కోపంతో మామ శ్రీను, బావమరుదులు సాయి, కల్యాణ్‌లు కలిసి రమేశ్‌పై దాడికి పాల్పడగా, తలకు గాయమైంది. బాధితుడి ఫిర్యాదు మేరకు ముగ్గురిపై కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ బి.రాము తెలిపారు.

మహిళ ఆత్మహత్యాయత్నం

భద్రాచలంఅర్బన్: పట్టణంలోని భూపతిరావు కాలనీకి చెందిన ఓ మహిళ బుధవారం ఆత్మహత్యకు యత్నించింది. స్థానికుల కథనం ప్రకారం.. కాలనీకి చెందిన బలరామ్, లక్ష్మి దంపతులకు మధ్య గొడవ జరిగింది. దీంతో లక్ష్మి ఒంటిపై కిరోసిన్ పోసుకుని నిప్పంటించుకుంది. కుటుంబ సభ్యులు వెంటనే స్థానికంగా ఉన్న ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చేర్పించారు. లక్ష్మి శరీరం 60 శాతం కాలిందని, ఆరోగ్య పరిస్థితి నిలకడగానే ఉందని చికిత్స అందిస్తున్న వైద్యులు తెలిపారు. కాగా ఈ ఘటనపై తమకు ఫిర్యాదు అందలేదని పోలీసులు తెలిపారు.